# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



News Portal Designing
Epaper Designing &
Web Hosting

Vn Media

+91 8099779988

vnteluguduily@gmail.com



సంపుటి : 3 సంచిక : 290 శనివారం 28 ఫిబ్రవరి 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## కాంగ్రెస్, బీజేపీ కుట్రలు తేటతెల్లమయ్యాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఈ కేసులో కాంగ్రెస్, బీజేపీ కుట్రలు తేటతెల్లమయ్యాయి

రాజకీయ కుట్రలో భాగమే ఈ కేసు అని తేలిపోయింది



హైదరాబాద్

ఢిల్లీ లిక్కర్ కేసులో చివరికి న్యాయమే గెలిచిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,. ఢిల్లీ లిక్కర్ కేసు సాకుతో కేజ్రీవాల్ సర్కారు కూల్చారని, ఆ కేసు వల్ల బీఆర్ఎస్ నష్టపోయిందన్నారు కేటీఆర్. ఈ కేసులో కాంగ్రెస్, బీజేపీ కుట్రలు తేటతెల్లమయ్యాయమన్నారు. రాజకీయ కుట్రలో భాగమే ఈ కేసు అని తేలిపోయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఫామ్‌హౌజ్‌కు కేటీఆర్ బయల్దేరి వెళ్లనున్నారు. ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో ఉన్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో..కేటీఆర్ భేటీ కానున్నారు.తాజా పరిణామాలపై కేసీఆర్‌తో చర్చించనున్నారు కేటీఆర్. ఢిల్లీ లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌కు క్లీన్‌చిట్‌తో పాటు కవితకు క్లీన్‌చిట్ అంశాలను చర్చించే అవకాశం ఉంది. ఇక రాజ్యసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేసే అంశంపై కూడా చర్చించే అవకాశం ఉంది.



## దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ముందుకు రావాలి

- ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయన్న మోదీ
- గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసింది
- పరిశ్రమలకు ఆర్థిక సంస్థలు ఆచరణాత్మక పరిష్కారాలతో అండగా నిలిచి మార్కెట్ నమ్మకాన్ని పెంచాలి
- కాగితంపై ఉన్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో విజయాలుగా సాకారం అవుతాయి

# హింస ఏ సమస్యకూ పరిష్కారం కాదు



- మావోయిస్టు నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చన్న ముఖ్యమంత్రి
- చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేస్తుంది
- ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ పట్టుకుంటే నడవదని మాజీ మావోయిస్టు కీలక వ్యాఖ్య
- సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన మాజీ మావోయిస్టులు
- దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్న

హైదరాబాద్

మావోయిస్టు కీలక నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మావోయిస్టు మాజీ అగ్ర నాయకులు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సచివాలయంలో సమావేశమైన విషయం తెలిసిందే. భేటీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చని తెలిపారు. చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. - మిగతా3లో

## మోదీ, అమిత్‌షా కుట్ర



- అరవింద్ కేజ్రీవాల్
- లిక్కర్ స్కాం కేసులో నిర్దోషిగా విడుదలైన తర్వాత, కేజ్రీవాల్ బీజేపీపై తన దాడిని ఎక్కుపెట్టారు
- తనపై తప్పుడు కేసులు బనాయించి,తనను ఆమ్ ఆద్మీ పార్టీని అంతం చేయాలని ప్రధాని మోదీ, అమిత్ షా ద్వయం కుట్ర పన్నింది
- లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలకు స్పందిస్తూ, తనపై, తన పార్టీపై వచ్చిన అన్ని ఆరోపణలు నిరాధారమైనవి

## ఇరాన్‌తో ఉద్రిక్తతలు



- ఇజ్రాయెల్ ఎంబసీ అధికారులకు అమెరికా రాయబారి కీలక ఆదేశాలు
- వెంటనే ఇజ్రాయెల్‌ను వీడాలని రాయబారి ఆదేశాలు
- ఇప్పటికిప్పుడు భయపడాల్సిందేమీ లేనప్పటికీ, దేశం వీడితే మంచిదని సూచన
- అమెరికా వెళ్లడానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని స్పష్టీకరణ




## తమిళనాడులో ప్రజాస్వామ్యానికి గొప్ప చరిత్ర

- ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు!
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- ప్రాచీన కాలం నుంచే తమిళనాడులో కుడవోలై విధానం
- అది ప్రపంచానికి ఆదర్శం
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు

# వేగం పెంచుతున్న అధికార పార్టీ

- గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించడమే లక్ష్యంగా అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్
- నలుగురు కీలక మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- రాబోయే ఎన్నికల నాటికి ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు ఈ సబ్ కమిటీ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయనుంది
- గ్రామీణ మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఈ ప్లాన్ ప్రధానంగా దృష్టి సారించనుంది



హైదరాబాద్

తెలంగాణలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలనలో వేగం పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించడమే లక్ష్యంగా అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ నలుగురు కీలక మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తం కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. రాబోయే ఎన్నికల నాటికి ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు ఈ సబ్ కమిటీ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయనుంది. గ్రామీణ మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఈ ప్లాన్ ప్రధానంగా దృష్టి సారించనుంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలు చేసేలా ప్రభుత్వం యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ వ్యూహం ప్రకారం.. రాబోయే మూడు నెలల - మిగతా3లో



## ‘న్యాయ వ్యవస్థపై నేను పెట్టుకున్న నమ్మకం నిలబడింది’

- ఢిల్లీ మద్యం కేసులో కోర్టు తీర్పుపై కవిత
- ఢిల్లీ మద్యం పాలసీ కేసును కొట్టివేసిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు
- ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్, కవిత, మనీశ్ సిసోదియాకు విముక్తి

హైదరాబాద్

ఢిల్లీ మద్యం పాలసీ వ్యవహారం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో విచారణ జరిపిన న్యాయస్థానం నిందితులందరిపైనా ఉన్న కేసులను కొట్టివేసింది. ఈ మేరకు సీబీఐ అభియోగాలు మోపిన 23 మందికి విముక్తి కల్పించింది. ఈ కేసులో కవితతో పాటు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియాకు కూడా ఊరట లభించింది. నిందితుల పేర్లను డిశ్చార్జ్ చేస్తూ - మిగతా3లో



## రసవత్తరంగా తమిళ రాజకీయాలు

- డీఎంకేలో చేరిన జయ నమ్మినబంటు పన్నీర్‌సెల్వం
- డీఎంకే ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో కండువా కప్పుకున్న పన్నీర్ సెల్వం
- రాజకీయ మనుగడ కోసం అధికార పార్టీ తీర్థం

## మోదీ, అమిత్‌షా కుట్ర

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ప్రభుత్వ మాజీ ఎక్సైజ్ (లిక్కర్) విధానానికి సంబంధించిన స్కాంలో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా భారీ ఊరట లభించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అవినీతి కేసులో సహా నిందితులందరినీ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆప్‌నేత కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. లిక్కర్ స్కాం కేసులో నిర్దోషిగా విడుదలైన తర్వాత, కేజ్రీవాల్ బీజేపీపై తన దాడిని ఎక్కుపెట్టారు. తనపై తప్పుడు కేసులు బనాయించి,తనను ఆమ్ ఆద్మీ పార్టీని అంతం చేయాలని ప్రధాని మోదీ, అమిత్ షా ద్వయం కుట్ర పన్నిందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలకు స్పందిస్తూ, తనపై, తన పార్టీపై వచ్చిన అన్ని ఆరోపణలు నిరాధారమైనవని తేలిందని కేజ్రీవాల్ అన్నారు. ఈ కేసులో సీబీఐ ,ఈడీ ఛార్జ్ షీట్లు దాఖలు చేసినప్పటికీ, ప్రాసిక్యూట్ చేయడానికి తగిన ఆధారాలు ఉన్నాయా లేదా అనే దానిపై తుది నిర్ణయం కోర్టుదేనని స్పష్టం చేశారు. కేసును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, కేసును కొనసాగించ డానికి ఖచ్చితమైన ఆధారాలు లేవని కోర్టు తేల్చిందని కేజ్రీవాల్ అన్నారు. కేజ్రీవాల్‌కు క్లీన్ చిట్ రావడంతో అటు ఆప్ శ్రేణులు, ఇటు ఆయన భార్య సునీత ఆనందంలో మునిగి తేలారు. భర్తను ఆలింగనం చేసుకొని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు.

## ఇరాన్‌తో ఉద్రిక్తతలు

ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ, ఇజ్రాయెల్‌ను వెంటనే వీడాలని అమెరికా రాయబారి మైక్ హకబీ అక్కడి ఎంబసీలోని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్, అమెరికా మధ్య గత కొన్నాళ్ళుగా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా రాయబారి ఈ ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ఇజ్రాయెల్‌ను వీడి స్వదేశానికి వెళ్లాలని సూచించారు. సిబ్బంది అమెరికా వెళ్లడానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇప్పటికిప్పుడు భయపడాల్సిందేమీ లేదని, కానీ ఇరాన్‌పై అమెరికా భీకర దాడికి ముందే ఇజ్రాయెల్‌ను వీడితే మంచిదని సూచించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరాన్‌పై దాడులకు దిగే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు. తమతో అణుఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ట్రంప్ హెచ్చరికలు చేసినప్పటికీ అణు ఒప్పంద చర్చలు అంత ఫలప్రదంగా ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో అమెరికా రాయబారి ఇజ్రాయెల్‌లోని తన ఎంబసీకి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. అమెరికా తమపై దాడి చేస్తే ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ఇప్పటికే పలుమార్లు అమెరికాకు స్పష్టం చేసింది. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను నాశనం చేస్తామని ప్రకటించింది.

## కోల్‌కతాలో భారీ భూకంపం, వణికిపోయిన జనం



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజధాని నగరం కోల్‌కతాలో శుక్రవారం మధ్యాహ్నం భారీ భూకంపం సంభవించింది. కోల్‌కతా, దాని పరిసర జిల్లాల్లో భూకంపాలు సంభవించాయి. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (చీజూ) ప్రకారం, భూకంపం రిక్టర్ స్కేలుపై 5.5 తీవ్రతతో నమోదైంది. 10 కి.మీ లోతులో సంభవించిన ఈ భూకంపం నైరుతి బంగ్లాదేశ్‌లో కేంద్రంగా ఉంది. భారతదేశం-బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలోని పరిసర జిల్లాల్లో కూడా భూకంపం సంభవించింది. దీని తీవ్రతను రిక్టర్ స్కేల్‌పై 5.4గా గుర్తించారు. ఇది 35 కి.మీ (21.75 మైళ్ళు) లోతులో సంభవించిందని యూరోపియన్ మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ (జుమీజ) తెలిపింది. కోల్‌కతా నగరం, పరిసర ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు ఈ ప్రకంపనలు కొనసాగాయి. ఎత్తైన నివాస సముదాయాలు, రద్దీగా ఉండే మార్కెట్‌లలో భూమి కంపించడంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. తాజా సమాచారం దీని వలన ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టంగా జరగలేదు. స్థానికుల ప్రకారం ప్రకంపనల సమయంలో సీలింగ్ ఫ్యాన్లు ఊగడం, ఫర్నిచర్ కంపించడం, కిటికీలు కొట్టుకోవడం లాంటివి సంభవించాయి. బహుళ అంతస్తుల భవనాలలో దీని ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఈ ఘటనకు సంబంధించిన సోషల్ మీడియాలో అనేక వీడియోలు వైరల్‌గా మారాయి.

## మద్యం పాలసీ కేసు విచారణపై స్పందించిన ఈడీ - హైకోర్టును ఆశ్రయించిన సీబీఐ

దిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనిలాండరింగ్ కేసు స్వతంత్రత కలిగిందని ఈడీ అధికారులు తెలిపారు. దిల్లీ మద్యం కుంభకోణం కేసు నుంచి మాజీ సీఎం కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా సహా నిందితులందరికీ దిల్లీ కోర్టు ఊరట కలిగించిన నేపథ్యంలో ఈడీ ఈ వ్యాఖ్యలు చేసింది. తమ దర్యాప్తు కేవలం సీబీఐ కేసుపై ఆధారపడి లేదని పక్కా సాక్ష్యాధారాలతో విచారిస్తున్నామని ఈడీ అధికారులు తెలిపారు. దిల్లీ మద్యం పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, ఇతరులను నిర్దోషులుగా విడుదల చేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈడీ అధికారుల ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. విజయ్ మదన్‌లాల్ కేసులో సుప్రీంకోర్టు 2022లో ఇచ్చిన తీర్పు మేరకు ప్రధాన కేసు కొట్టివేస్తే దానికి అనుబంధంగా ఉన్న మనీ లాండరింగ్ కేసు కూడా రద్దవుతుంది. అయితే, ఈడీ మాత్రం ప్రధాన కేసు ఫలితంతో సంబంధం లేకుండా మనీ లాండరింగ్‌ను ఒక స్వతంత్ర నేరంగా పరిగణించాలని కోరుతోంది. దిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించి, తమ ఛార్జిషీట్లలో సమర్పించిన ఆధారాలు విశ్వసనీయమని ఈడీ పేర్కొంది. సీబీఐ సమర్పించిన ఆధారాలకంటే తమ ఆధారాలు చాలా భిన్నమైనవని తెలిపింది. అక్రమంగా సంపాదించిన నిధులను ఎలా సేకరించారో, ఎలా వినియోగించారో వివరంగా ఛార్జిషీట్లలో వెల్లడించామని ఈడీ అధికారులు తెలిపారు. మరోవైపు, ట్రయల్ కోర్టు ఇంకా ఈడీ కేసు మేరిట్‌పై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని అధికారులు స్పష్టం చేశారు. అవసరమైన సమయంలో తమ వాదనలు కోర్టులో వినిపిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా, మనీ లాండరింగ్ కేసును ప్రిడికేట్? నేరం నుంచి వేరుచేయాలా? లేదా విజయ్ మదన్‌లాల్ కేసులో నిర్వహించిన విధంగా కొనసాగించాలా? అనే అంశంపై కూడా సుప్రీంకోర్టు పరిశీలిస్తోందని తెలిపారు. దిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కె. కవిత సహా మొత్తం 23 మంది నిందితులను ఈ కేసు నుంచి డిశ్చార్జ్ చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ట్రయల్ కోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే సీబీఐ దీనిపై దిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. దర్యాప్తులోని పలు కీలక అంశాలను రౌస్ అవెన్యూ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, కొన్ని ముఖ్యమైన సాక్ష్యాలను విస్మరించిందని సీబీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఉత్తర్వులపై స్టే విధించాలని సీబీఐ కోరింది.

### ఈ కేసులో మొత్తం 8 ఛార్జిషీట్లు దాఖలు

ఇదిలా ఉండగా, ఈ కేసులో ఈడీ ఇప్పటివరకు మొత్తం ఎనిమిది ఛార్జిషీట్లు దాఖలు చేసింది. మొత్తం 40 సంస్థలను నిందితులుగా పేర్కొంది. కేజ్రీవాల్?, సిసోడియాలతో సహా 18 మందిని అరెస్ట్ చేసింది. ఈడీ తన ఛార్జిషీట్లలో కేజ్రీవాల్‌ను ఎక్సైజ్ కుంభకోణంలో 'కింగ్‌పిన్' పేర్కొంది. నాటి ప్రభుత్వంలోని దిల్లీ మంత్రులు, ఆప్ నాయకులు, ఇతరులతో కలిసి కుట్ర పన్నారని ఆరోపించింది. మరోవైపు, ఈ పరిణామాలపై స్పందించిన కేజ్రీవాల్, తనపై నమోదైన అవినీతి కేసు స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ కుట్ర అని ఆరోపించారు. తమపై తప్పుడు ఆరోపణలు చేసి రాజకీయంగా ఇబ్బంది పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

# దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ముందుకు రావాలి

దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు, ఆవిష్కరణలతో ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆయా పరిశ్రమలకు ఆర్థిక సంస్థలు ఆచరణాత్మక పరిష్కారాలతో అండగా నిలిచి మార్కెట్ నమ్మకాన్ని పెంచాలని సూచించారు. 'వికసిత్? భారత్' కోసం సాంకేతికత, సంస్కరణలు, ఆర్థికం అనే అంశంపై నిర్వహించిన బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు.



ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయని మోదీ పేర్కొన్నారు. కాగితంపై ఉన్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో విజయాలుగా సాకారం అవుతాయని వివరించారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందని ప్రధాని తెలిపారు. 11 ఏళ్ల క్రితం కేవలం రూ. 2 లక్షల కోట్లుగా ఉన్న మూలధన పెట్టుబడులు, 2026-27 బడ్జెట్‌లో రూ. 12 లక్షల కోట్లకుపైగా పెరిగాయని వివరించారు. ఈ భారీ కేటాయింపులు ప్రైవేట్ రంగానికి ఒక సంకేతమని పేర్కొన్నారు. మరోవైపు, బడ్జెట్‌లోని విషయాలపై మరింత చర్చ జరిపేకంటే దాని తక్షణ అమలుపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ వాటాదారులను కోరారు.

"బడ్జెట్ గురించి చర్చించడం దీని ఉద్దేశం కాదు. వీలైనంత త్వరగా బడ్జెట్‌ను అమలు చేయడం, అది సులభమైన మార్గంలో చేయడం దీని ఉద్దేశం. వాటాదారులందరూ దీని నుంచి ప్రయోజనం పొందాలి. బడ్జెట్‌ను కేవలం స్వల్పకాలిక వ్యాపార పత్రంగా చూడకూడదు. అది ఒక విధానపరమైన మార్గదర్శి. బడ్జెట్ ప్రభావాన్ని పటిష్టమైన, వాస్తవిక పారామితులపై అంచనా వేయాలి. ఇలాంటి విధానాలు మౌలిక సదుపాయాలను విస్తరించాలి. రుణ లభ్యతను మరింత సరళతరం చేయాలి. సులభతర వాణిజ్యాన్ని పెంచాలి. పాలనలో పారదర్శకత పెరగాలి. ప్రజల జీవనం మరింత సులభతరం కావాలి. బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన నిర్ణయాలు మాత్రమే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. అత్యంత గొప్ప విషయం ఏమిటంటే ఏ బడ్జెట్‌ను కూడా వేరు చేసి చూడడానికి వీల్లేదు. దేశ నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ. ప్రతీ బడ్జెట్ ఒక పెద్ద లక్ష్యాన్ని చేరుకునేందుకు ఒక అడుగు అవుతుంది. మన ముందు ఉన్న ఆ పెద్ద లక్ష్యం ఏమిటంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతావని. ప్రతీ సంస్కరణ, ప్రతీ మార్పు ఈ సుదీర్ఘ ప్రస్థానాన్ని దృష్టిలో పెట్టుకొని మాత్రమే చేయాలి."

అదేవిధంగా, ఆర్థిక రంగం గురించి కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చించారు. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్? మార్కెట్లను మెరుగుపరిచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడి చట్రాన్ని మరింత అనుకూలంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. "విదేశీ పెట్టుబడి చట్రాన్ని సులభతరం చేస్తున్నాం. పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చడానికి మేం ప్రయత్నిస్తున్నాం. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడా నికి బాండ్ మార్కెట్లను మరింత చురుగ్గా చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నాం. బాండ్లను కొనుగోలు చేయడం, అమ్మడం వంటి ప్రక్రియను సులభతరం చేస్తున్నాం. దీర్ఘకాలిక వృద్ధికి దోహదపడే బాండ్ మార్కెట్ సంస్కరణలను మనం చూడాలి. స్థిరమైన విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి మనం సరికొత్త సాధనాలను తీసుకురావాలి. ప్రభుత్వం, పరిశ్రమ, ఆర్థిక సంస్థలు, విద్యాసంస్థల మధ్య ఉమ్మడి వెంచ´ర్‌గా స్పష్టమైన సంస్కరణ భాగస్వామ్య చార్టర్?ను అభివృద్ధి చేయాలి" అదేవిధంగా పరిశ్రమలు నూతన ఉత్సాహంతో ముందుకు రావాలని ప్రధాని మోదీ కోరారు. 2026-27 బడ్జెట్‌లో ప్రకటించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, విద్యా సంస్థల మధ్య సమన్వయం కోసం 'రిఫార్మ్ పార్టనర్‌షిప్ చార్టర్' రూపొందించాలని ప్రధాని ప్రతిపాదించారు. 2047 నాటికి 'వికసిత్? భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ పత్రం కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# తమిళనాడులో ప్రజాస్వామ్యానికి గొప్ప చరిత్ర

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్? రాష్ట్ర రాజకీయ పార్టీలతో కీలక సమావేశం నిర్వహించారు. చెన్నైలో జరిగిన ఆ సమావేశంలో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల ప్రతినిధులు పాల్గొని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎన్నికలను ఒకే దశలో నిర్వహించాలని ఎక్కువ పార్టీలు కోరినట్టు అధికారులు తెలిపారు. డబ్బు, బహుమతుల ప్రలోభాలకు కట్టడి విధించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాన్ని భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిషనర్‌లతో పాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణ, భద్రత, సిబ్బంది శిక్షణ, ఈవీఎంల నిర్వహణ, చట్టవ్యవస్థ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను సమీక్షించారు.

### కఠిన చర్యలు తప్పవు

రాజకీయ పార్టీలు ఎన్నికల్లో డబ్బు ప్రభావం, ఉచిత పథకాల పంపిణీ వంటి అక్రమాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరాయి. అక్రమాల నివారణకు ఫ్లయింగ్ స్క్వాడ్ల సంఖ్యను పెంచాలని కూడా సూచించాయి. దీనిపై స్పందించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికలు ఎప్పటికీ చట్టబద్ధంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రలోభాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలా!

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజాస్వామ్య సంప్రదాయాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. తమిళనాడుకు ప్రజాస్వామ్యంలో గొప్ప చరిత్ర ఉందని, ప్రాచీన కాలంలోనే




కుడవోలై విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. ఇది ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు. ఇటీవల 72 దేశాల ప్రతినిధులతో అంతర్జాతీయ సమావేశం నిర్వహించి, తమిళనాడులో శతాబ్దాల క్రితమే అమలులో ఉన్న ఎన్నికల విధానం గురించి వివరించామని తెలిపారు. ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలా జరుపుకోవాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

### ఓటర్ల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగుతోందని ఆయన తెలిపారు. అర్హులెవరూ తప్పిపోకూడదని, అనర్హులెవరూ జాబితాలో చేరకూడదనే లక్ష్యంతో చర్యలు చేపట్టామని చెప్పారు. తమిళనాడులో అమలు చేస్తున్న విధానం దేశానికి మోడల్‌గా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 75 వేల పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించనున్నారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలు అందరికీ సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం మరింతగా!

ఎన్నికల పారదర్శకతను పెంచేందుకు కొత్త చర్యలు తీసుకున్నట్టు సీఈసీ వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ఈవీఎంల లెక్కింపుకు ముందే పూర్తి చేయనున్నారు. ప్రతి నియోజకవర్గంలో తప్పనిసరిగా వీవీప్యాట్ స్లిప్‌ల లెక్కింపు జరుగుతుందని స్పష్టం చేశారు. లెక్కింపు అనంతరం అభ్యర్థులు ఫీజు చెల్లించి ఏడు రోజుల లోపు ఈవీఎంలను వీవీప్యాట్‌లతో సరిపోల్చుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. దీనివల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని చెప్పారు.

### పక్షపాతం లేకుండా విధులు

ఇటీవల జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఐజీలు, డీఐజీలు, వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. చట్టవ్యవస్థ పటిష్టంగా ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అధికారులు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా, పక్షపాతం లేకుండా విధులు నిర్వర్తించాలని కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన వారిపై జీరో టాలరెన్స్ విధానం పాటిస్తామని హెచ్చరించింది. ఇదిలా ఉండగా, ఎన్నికల తేదీల నిర్ణయంలో పండుగల తేదీలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని రాజకీయ పార్టీలు కోరాయి. దీనిని పరిశీలిస్తామని సీఈసీ హామీ ఇచ్చారు. మొత్తానికి రాబోయే అసెంబ్లీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి సన్నాహాలు జరుగుతున్నాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# రసవత్తరంగా తమిళ రాజకీయాలు

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. దివంగత సీఎం జయలలితకు అత్యంత నమ్మకస్తుడిగా గుర్తింపు పొందిన, మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఓ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలో చేరారు. అధికార ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే)లో ఆయన శుక్రవారం అధికారికంగా చేరడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సమక్షంలో చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఓపీఎస్‌కు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. అన్నాడీఎంకేలో కీలక పదవులు నిర్వహించిన పన్నీర్‌సెల్వం, 2022లో పార్టీ అంతర్గత అధికార పోరాటం తర్వాత బహిష్కరణకు గురయ్యారు. ఆ తర్వాత మళ్లీ తన మాతృపార్టీలోకి చేరేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో చివరకు రాజకీయ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని డీఎంకేలో చేరినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు తన కుమారుడు పి. రవీంద్రనాథ్ కుమార్, అనుచరులు కూడా డీఎంకేలో చేరడం విశేషం.

### స్టాలిన్ ఆదేశాల మేరకు పని చేస్తానని స్పష్టం

డీఎంకేలో చేరిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఓపీఎస్, అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పార్టీకి భవిష్యత్‌లో ఎలాంటి విజయం దక్కకుండా చేసే పరిస్థితిని పళనిస్వామి సృష్టించారు. ఆయన నిరంకుశుడు, అహంకారి. పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నాశనం చేశారు" అంటూ మండిపడ్డారు. గతంలో తనకు జరిగిన విషయాల గురించి ఇప్పుడు ఆలోచించడం లేదని, ఇకపై సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు పని చేస్తానని స్పష్టం చేశారు. స్టాలిన్ నాయకత్వంపై ప్రశంసలు కురిపించిన ఓపీఎస్, "ప్రజల అవసరాలు అర్థం చేసుకుని సంక్షేమ పథకాలు అందిస్తున్న నాయకుడు స్టాలిన్. అందరికీ సమానంగా పాలన అందిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ద్రవిడ సిద్ధాంతాల పరిరక్షణ కోసం డీఎంకే కట్టుబడి ఉంది" అని అన్నారు. ఇకపై తాను కూడా సాధారణ కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఇక అసెంబ్లీలో కూడా ఈ రాజకీయ మార్పు ప్రభావం కనిపించింది. ఓపీఎస్ వర్గానికి చెందిన ఎమ్మెల్యే పి. అయ్యప్పన్, స్టాలిన్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటూ ప్రసంగించారు. ముఖ్యంగా పాఠశాల పిల్లల కోసం అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రశంసిస్తూ, "తల్లిలా పిల్లలకు ఆహారం అందించే ప్రభుత్వం ఇది" అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేనే మళ్లీ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ఈ పరిణామంపై ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్‌డీఏ మిత్రపక్షమైన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ ధినకరన్ స్పందిస్తూ, "ఓపీఎస్‌కు తనకు నచ్చిన కూటమిలో చేరే హక్కు ఉంది. కానీ జయలలితా వారసత్వాన్ని ఈ నిర్ణయానికి కారణంగా చూపడం సమంజసం కాదు" అన్నారు. ఆ వ్యాఖ్యలు జయలలిత అభిమానులకు ఆమోదయోగ్యం కావని స్పష్టం చేశారు. రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల ముందు ఓపీఎస్ నిర్ణయం రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశముంది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో గత ఎన్నికల్లో డీఎంకే కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించింది. ఇప్పుడు ద్రవిడ మోడల్ 2.0 నినాదంతో మరోసారి అధికారంలోకి రావాలని స్టాలిన్ ప్రయత్నిస్తున్నారు. మరోవైపు అన్నాడీఎంకే-బీజేపీ కూటమి కూడా గట్టి పోటీకి సిద్ధమవుతోంది. అదనంగా సినీనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం రంగప్రవేశం చేయడంతో పోటీ త్రిముఖంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, జయలలిత నమ్మిన వ్యక్తిగా ఎదిగిన ఓపీఎస్ ఇప్పుడు ప్రత్యర్థి డీఎంకేలో చేరడం తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టే. ఈ నిర్ణయం రాబోయే ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# గాంధీ సరోవర్ ప్రాజెక్ట్

## అభివృద్ధి మంత్రామా? పర్యావరణ విధ్వంసమా?

**హైదరాబాద్ :** హైదరాబాద్ లైఫ్ లైన్ అయిన మూసీ నదికి పూర్వ వైభవం తీసుకురావాలనే పట్టుదలతో తెలంగాణ ప్రభుత్వం 'గాంధీ సరోవర్' అనే ప్రతిష్టాత్మక రిజర్వాయర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. బండ్లగూడ ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా అటు వరదల ఉధృతిని అరికట్టడంతో పాటు, ఇటు నగరం నడిబొడ్డున పర్యావరణ సమతుల్యతను కాపాడాలని అధికారులు భావిస్తున్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా రాబోయే ఈ మార్పు నగర ముఖచిత్రాన్నే మారుస్తుందని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. అయితే, మ్యాప్‌లో గీసిన ఈ ప్లాన్ క్షేత్రస్థాయిలో ఉన్న వేలాది కుటుంబాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ముఖ్యంగా మధుపార్క్ వంటి కాలనీలు ఈ ప్రాజెక్టు వల్ల పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు. అభివృద్ధి అనే పదానికి అర్థం తమ ఇళ్లను కూల్చడమేనా అని మధుపార్క్ నివాసితులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. దశాబ్దాల కాలంగా రూపాయి రూపాయి పోగేసి, ఎన్నో కలలతో కట్టుకున్న తమ గూడు ఒక్క రాత్రిలో అక్రమ కట్టడంగా మారిపోవడం వారిని కలిచివేస్తోంది. మార్కింగ్‌ల పేరుతో అధికారులు తిరుగుతుంటే, రేపు తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనతో ఆ ప్రాంత వాసులకు కంటిమీద కునుకు కరువైంది. కేవలం ఒక ప్రాజెక్టు కోసం తరతరాలుగా ఉంటున్న మనుషులను రోడ్డున పడేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుండి ఎలాంటి స్పష్టమైన భరోసా లభించకపోవడం ఈ కాలనీల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడటానికి ప్రధాన కారణమైంది. ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం చట్టపరమైన పత్రాలు. స్థానికుల వద్ద అన్ని అనుమతులతో కూడిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉండగా, ఇప్పుడు ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని బఫర్ జోన్ లేదా ఎఫ్.టి.ఎల్ పరిధిలోకి వస్తుందని ప్రకటించడం గందరగోళానికి దారితీసింది. ఇన్నాళ్లూ మున్సిపల్ పన్నులు వసూలు చేసి, కరెంటు కనెక్షన్లు ఇచ్చి, రిజిస్ట్రేషన్లు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు అకస్మాత్తుగా అవన్నీ నిబంధనలకు విరుద్ధమని చెప్పడం విడ్డూరంగా ఉందని బాధితులు వాపోతున్నారు. చట్టబద్ధంగా కొనుక్కున్న ఆస్తులకు రక్షణ లేకపోతే సామాన్య మధ్యతరగతి మనిషి ఎవరిని నమ్మాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ డాక్యుమెంట్ల పంచాయితీ ఇప్పుడు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పెద్ద యుద్ధంగా మారింది. మరో కోణంలో చూస్తే, ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నగర భవిష్యత్తు కోసం అనివార్యమైనదిగా చూస్తోంది. మూసీ నదికి వచ్చే భారీ వరదలను నియంత్రించకపోతే భవిష్యత్తులో హైదరాబాద్‌కు ముప్పు తప్పదని, అందుకే గాంధీ సరోవర్ వంటి రిజర్వాయర్లు అవసరమని అధికారులు వాదిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం ద్వారా నగరానికి కొత్త కళ వస్తుందని, పర్యావరణ పరంగా కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని వారి వాదన. బాధితులకు తగిన పరిహారం అందిస్తామని లేదా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇస్తున్నప్పటికీ, తమ సొంత ఇళ్లను వదిలి ఇరుకు గదుల్లోకి వెళ్లడానికి ప్రజలు ఏమాత్రం సిద్ధంగా లేరు. ప్రస్తుతం బండ్లగూడలో పరిస్థితి నివ్వుకణికలా ఉంది. ఒకవైపు సర్వేలు నిర్వహిస్తున్న అధికారులు, మరోవైపు తమ ఇళ్లను కాపాడుకోవడానికి ప్రాణాలకు తెగించి పోరాడుతున్న ప్రజలతో ఆ ప్రాంతం నిరంతరం యుద్ధభూమిని తలపిస్తోంది. అభివృద్ధి పేరుతో సామాన్యుల హక్కులను కాలరాయవద్దని



పౌర సమాజం నుండి కూడా మద్దతు లభిస్తోంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మొండిగా ముందుకు తీసుకెళ్తుందా లేక ప్రజల విజ్ఞప్తులను మన్నించి తన ప్రణాళికను సవరిస్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, అభివృద్ధి కింద నలిగిపోతున్న సామాన్యుడి ఆవేదన మాత్రం హైదరాబాద్‌లో పెద్ద చర్చకు దారితీసింది.

**అప్పుడు 12... ఇప్పుడు 50**

హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా భావిస్తున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మూసీ తీర ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇక్కడ ప్రతిపాదించిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం కిస్మత్‌పురా, దర్గా డివిజన్ల పరిధిలో భూసేకరణ చేపట్టనున్నట్లు రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక నోటిఫికేషన్ కూడా జారీ కావడంతో స్థానికంగా ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్, ఉప్పర్‌పల్లి పరిధిలోని పలు కీలక నిర్మాణాలను అధికారులు స్వాధీనం చేసుకోనున్నారు. ముఖ్యంగా మధు పార్క్ రిడ్జ్ వంటి ప్రముఖ అపార్ట్‌మెంట్లు కూడా 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలోకి వస్తుండటంతో వాటి భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. గతంలో ఈ ప్రాంతంలో బఫర్ జోన్ నిబంధనలు వేరుగా ఉన్నప్పటికీ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. దీనివల్ల గతంలో అనుమతులు పొంది నిర్మించిన భవనాలు కూడా ఇప్పుడు ప్రభుత్వ సేకరణ పరిధిలోకి రాక తప్పని పరిస్థితి ఏర్పడింది. చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 2004 సంవత్సరంలో మూసీ బఫర్ జోన్ కేవలం 12 మీటర్లుగా మాత్రమే ఉండేది. అయితే నది పరిరక్షణ, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 2012లో ఈ పరిమితిని 50 మీటర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మధు పార్క్ రిడ్జ్ వంటి భారీ నివాస సముదాయాలు ఇప్పుడు బఫర్ జోన్ పరిధిలోకి వచ్చాయి. అప్పట్లో నిబంధనల ప్రకారమే అనుమతులు పొందినప్పటికీ, ప్రస్తుత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్మాణాలను సేకరించడం అనివార్యమని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు భరోసా ఇస్తూ, ప్రభుత్వం ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తుందని ఆర్డీవో హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం అపార్ట్‌మెంట్ వాసులకు పరిహారం చెల్లించి, ఆ తర్వాతే ఆయా నిర్మాణాలను స్వాధీనం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కేవలం బలవంతంగా ఖాళీ చేయించడం కాకుండా, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తామని స్పష్టం చేశారు. భూసేకరణలో పారదర్శకత పాటిస్తూ, బాధితుల నుంచి వచ్చే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు ప్రభుత్వం తరపున అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం మొత్తం 83 ఎకరాల 13 గుంటల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ భారీ విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు భూములు, నివాస ప్రాంతాలను గుర్తించి, వాటి యజమానులతో సంప్రదింపులు జరిపేందుకు యంత్రాంగం సిద్ధమైంది. కేవలం అపార్ట్‌మెంట్లు మాత్రమే కాకుండా, నది పరివాహక ప్రాంతంలోని అన్ని రకాల ఆక్రమణలు, బఫర్ జోన్ ఉల్లంఘనలపై అధికారులు నిశితంగా దృష్టి సారించారు. భూసేకరణ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం దశల వారీగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోంది. ఉన్నఫళంగా ఇళ్లను ఖాళీ చేయించబోమని, ప్రతి అడుగులోనూ బాధితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి 60 రోజుల పాటు స్థానికుల నుంచి అభ్యంతరాలు, సలహాలను స్వీకరిస్తారు. ఈ సమయంలో వచ్చే ప్రతిపాదనలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని ఆర్డీవో వెంకట్ రెడ్డి విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం మూసీ నదికి పాత వైభవాన్ని తీసుకురావడమే కాకుండా, నగరవాసులకు ఒక చక్కని పర్యాటక ప్రాంతాన్ని అందుబాటులోకి తీసుకురావడం. గాంధీ సరోవర్ పేరుతో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇన్నాళ్లూ అక్కడ నివాసం ఉంటున్న సామాన్యులకు పరిహారం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు

# ఆర్టీసీ బస్సుల్లో తగ్గిన చార్జీలు

**హైదరాబాద్ :** వేసవికాలంలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు టీజీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏసీ బస్సుల్లో టికెట్ల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. మార్చి 1వ తేదీ నుంచి తగ్గించిన ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే సమ్మర్ మొదలుకావడంతో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా యి. ఉక్కబోత కూడా మొదలుకాబోతుంది. దీని వీటి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఏసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చేందుకు హైదరాబాద్‌లో తిరిగే ఏసీ బస్సుల్లో టికెట్ల రేట్లను తగ్గించారు. దీంతో ప్రజలపై భారం తగ్గడంతో పాటు ఎండాకాలంలో హాయిగా ఏసీ బస్సు ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు. ఏయే బస్సుల్లో ఎంత తగ్గించారు.. తగ్గించిన తర్వాత ఛార్జీలు ఎలా ఉన్నాయి అనే విషయాలు తెలుసుకుందాం. గతంలో మెట్రో డీలక్స్ ఏసీ బస్సుల్లో ప్రతీ నాలుగు కిలోమీటర్లకు టికెట్ ఛార్జీ రూ.30గా ఉండేది. కానీ ఇప్పుడు రూ.25కి తగ్గింది. దీంతో ప్రతీ నాలుగు కిలోమీటర్ల ప్రయాణంపై రూ.5 మేర తగ్గింపు మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుందని టీజీఎస్‌ఆర్టీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఈ-మెట్రో ఏసీ బస్సుల్లో గతంలో నాలుగు కిలోమీటర్లకు రూ.35 చొప్పున ఉండగా.. ఇప్పుడు రూ.25కి తగ్గనుంది. ఏకంగా రూ.10 మేర తగ్గనుండటం ప్రయాణికులకు ఊరటగా చెప్పవచ్చు. ఎండాకాలంతో పాటు ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ నిండుగా ఉండటం లేదు. ప్రస్తుతం 60 శాతం మాత్రమే ఆక్యుపెన్సీ ఉంటుంది. ధరలు ఎక్కువగా ఉంటాయనే కారణంతో కొంతమంది వెనకడుగు వేస్తున్నారు. ఛార్జీలను తగ్గిండచడం వల్ల ఆక్యుపెన్సీ పెరగడంతో పాటు




సమ్మర్‌లో ప్రయాణికులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో టీజీఎస్‌ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది. 1 నుంచి 3 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలర్స్ బస్సుల్లో 0 నుంచి రూ.10 వరకు ఆదా కానుండగా.. ఈ-మెట్రో బస్సుల్లో 5 నుంచి రూ.10 తగ్గుతుంది. ఇక 4-15 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.5 నుంచి రూ.10, ఈ-మెట్రో బస్సుల్లో రూ.10 నుంచి రూ.15 ఆదా అవుతుంది. ఇక 16 నుంచి 21 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.10 నుంచి రూ.15, ఈ-మెట్రో బస్సులలో రూ.10 నుంచి రూ.15, 22-30 కిలోమీటర్ల ప్రయాణానికి మెట్రో డీలక్స్,ఈ మెట్రో ఏసీ బస్సుల్లో రూ.5 నుంచి రూ.10 వరకు ఆదా అవుతుంది. కాగా జీహెచ్‌ఎంసీ పరిధిలో మొత్తం 275 మెట్రో డీలక్స్, 90 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ఛార్జీల తగ్గింపుతో నగర ప్రజలకు లబ్ది చేకూరనుంది.

## హింస ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదు

-మొదటిపేజీ తరువాయి

అడవుల్లో గడిపి ప్రజాస్వామ్య మార్గాన్ని ఎంచుకున్నందుకు సీఎం అభినందనలు
హింస ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదు: సీఎం రేవంత్‌రెడ్డి
ప్రజల ఆకాంక్షలు ప్రజాస్వామ్యం ద్వారానే నెరవేరుతాయి: సీఎం
ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మావోయిస్టు మాజీ నేతలు
సాయుధ పోరాటాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి వచ్చేందుకు అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతలు
పొరుగు రాష్ట్రాల తరహాలో మెరుగైన పునరావాస ప్యాకేజీలు కల్పించాలి: మాజీ మావోయిస్టులు
లొంగిపోయిన మాజీ మావోయిస్టులకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్న సీఎం
మాజీ మావోయిస్తులకు భద్రత, గౌరవంగా జీవించేలా ప్రభుత్వం సహకరిస్తుంది
రెండేళ్లలో 591 మంది మావోయిస్టులు లొంగిపోయారని వివరించిన డీజీపీ శివధర్‌రెడ్డి
పోలీసుల సమన్వయం, ప్రభుత్వ పునరావాస విధానాలతో జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు

**తుపాకీ పట్టుకుంటే నడవదు: దేవ్‌జీ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం మాజీ మావోయిస్టు దేవ్‌జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రివార్డు పాలసీని కోటి రూపాయలకు పెంచాలని ఆయన కోరారు. తమకు ఐదెకరాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. భూమి సాధ్యం కాదని ముఖ్యమంత్రి చెప్పారని, కానీ ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అనుమతిస్తే జైళ్లలో ఉన్న మావోయిస్టులను కలిసి, ఆ తర్వాత లొంగుబాట్లపై అందరం కలిసి ప్రజలకు బహిరంగ లేఖ రాస్తామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ సిద్ధాంతం నడవదని ప్రజలకు వివరిస్తామని అన్నారు.

## 'న్యాయ వ్యవస్థపై నేను పెట్టుకున్న నమ్మకం నిలబడింది'

-మొదటిపేజీ తరువాయి





రౌస్ అవెన్యూ కోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. మద్యం కేసులో కోర్టు తీర్పు అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కవిత స్పందించారు. 'సత్యమేవ జయతే' అని ఆమె ఎక్స్?లో పోస్టు చేశారు. జైలులో గడిపిన సమయాన్ని ఎవరు తిరిగిస్తారు? : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుపై కవిత మాట్లాడారు. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో కడిగిన ముత్యంలా బయటకు వస్తానని తెలంగాణ ప్రజలకు తాను మొదటి నుంచీ చెబుతున్నానని ఆమె గుర్తు చేశారు. అందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు తీర్పును వెలువరించిందని తెలిపారు. న్యాయ వ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని కవిత వివరించారు. ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని తాను ఎన్నోసార్లు చెప్పానన్నారు. ఈ కేసు వల్ల తాను, తన కుటుంబం 5 నెలల పాటు క్షోభ అనుభవించామన్నారు. కష్ట సమయంలో తనకు అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు. తన కుటుంబానికి దూరమై, 5 నెలలు జైలులో గడిపిన సమయాన్ని ఎవరు తిరిగిస్తారని ఆమె ప్రశ్నించారు. కోర్టు తీర్పు రాకుండానే కొందరు అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. "మేము ముందు నుంచి ఏదైతే తెలంగాణ ప్రజలకు చెబుతూ వచ్చామో అదేవిధంగా ఇవాళ కోర్టు అందరినీ నిర్దోషులుగా విడుదల చేయడం జరిగింది. ఈ దేశంలో న్యాయవ్యవస్థపై నేను పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముకాకుండా కాపాడింది. రాజకీయపరంగా కేసు పెట్టారని నేను పదే పదే చెప్పిందే నిజమైంది. కడిగిన ముత్యంలా బయటకు వస్తానని నేను ఇంతకు ముందే చెప్పాను. అదేవిధంగా రావడం జరిగింది. నేను జైలులో ఉన్న సందర్భంలో కార్యకర్తలు అనేక సార్లు వారి సొంత డబ్బులు ఖర్చు చేసి ఢిల్లీకి వచ్చి నాకు, నా కుటుంబానికి అండగా నిలబడ్డారు. వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను"- కవిత, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

సరైన ఆధారాలు లేకుండానే కేసులో ఇరికించారు : విచారణ సందర్భంగా సరైన ఆధారాలు లేకుండానే ఈ కేసులో పేర్లు చేర్చారని విచారణ సందర్భంగా సీబీఐపై రౌస్? అవెన్యూ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని మండిపడింది. నిందితులు తప్పు చేశారనటానికి సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. తగిన ఆధారాలు లేకుండానే కేసులో ఇరికించారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ విషయంలో సీబీఐ అధికారులపైనే దర్యాప్తు జరగాలని అభిప్రాయపడ్డారు. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా ఇతర నిందితులందరిపై సీబీఐ కేసులు కొట్టివేసింది. నిందితుల డిశ్చార్జ్ పిటిషన్లపై కోర్టులో 45 రోజుల పాటు వాదనలు సాగాయి. నాకు ఈ కేసుతో సంబంధం లేదని ఎన్నోసార్లు చెప్పా : ఢిల్లీ మద్యం కేసులో తనకు ఏమాత్రం సంబంధం లేదని ఎన్నోసార్లు చెప్పానని, తాను అన్నదే నిజమని ఇవాళ కోర్టు తీర్పుతో తేలిందని కవిత అన్నారు. కొన్ని నెలలపాటు జైలులో ఉంచి మానసికంగా వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు తెలకుండానే వ్యక్తిత్వ హననం చేశారని మండిపడ్డారు. తనపై పెట్టిన కేసువల్లే బీఆర్ఎస్? ఓడిపోయిందన్నట్లుగా తన అన్న కేటీఆర్? పోస్టుచేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి తాను కారణమా? అని ఆమె కేటీఆర్?ను ప్రశ్నించారు. ప్రజలకు ఇళ్లు ఇవ్వకపోవటం, ఉద్యోగాలు ఇవ్వకపోవటం బీఆర్ఎస్ ఓటమికి కారణమన్నారు. మూడు నెలల్లో కొత్తపార్టీ పెడుతున్నా : అభ్యర్థులను మార్చకుండా మళ్లీ వాళ్లకే టికెట్లు ఇవ్వటం బీఆర్ఎస్ ఓటమికి ఓ కారణమని కవిత అన్నారు. దోపిడీదారులకే మళ్లీ టికెట్లు ఇచ్చి ప్రజలపై రుద్దే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అన్నింటికంటే ముఖ్యంగా వారి అహంకార ధోరణే పార్టీ ఓటమికి కారణమన్నారు. ఇవాళ కోర్టు తీర్పును వారికి అనుకూలంగా మార్చుకుని మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఓటమిని తన మెడలో వేయాలని చూడటం కరెక్ట్ కాదన్నారు. మరో మూడు నెలల్లో కొత్త పార్టీ పెట్టబోతున్నానన్నారు. తనపై పెట్టిన కేసులపై మూడేళ్లుగా ఒంటరిగానే పోరాడుతున్నానని కవిత తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి నాకు ఎప్పుడూ మద్దతు రాలేదన్నారు. పార్టీ పెట్టే ముందే కోర్టు తీర్పు రావటం సంతోషకరమన్నారు.

## వేగం పెంచుతున్న అధికార పార్టీ

-మొదటిపేజీ తరువాయి



పాటు మంత్రులు, ఉన్నతాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలోనే పర్యటించనున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరువ చేయడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనుల సందడి నెలకొనేలా చూడాలని సబ్ కమిటీ నిర్ణయించింది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, వంద రోజుల లోపు స్పష్టమైన మార్పు చూపడం ద్వారా ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం యోచిస్తోంది. అధికారులకు సైతం స్పష్టమైన గడువులను నిర్దేశించి, పనుల్లో జాప్యం లేకుండా పర్యవేక్షించే బాధ్యతను ఈ నలుగురు మంత్రుల కమిటీకి అప్పగించారు.

# సిరిచెల్మ కు తరలివెళ్తున్నా భక్తులు

## పిల్ల పాపలతో కుటుంబ సమేతంగా మొక్కులు... మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు




**వాస్తవ నేస్తం, ఇచ్చోడ :** పొడిచేటి పొద్దువోలే దివ్యంగా వెలిగే దివ్యవోలే.. అందమైన రూపం నీది అన్న మల్లన్న.. సుందరంగా వెలిసినావ అన్న మల్లన్న అంటూ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో నెలకొన్న తమ ఇష్టమైన మల్లికార్జున స్వామిని పూజించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. జాతర ముగింపుకు ఒక్క రోజు మాత్రమే ఉండడంతో శుక్ర వారం మల్లికార్జున ఆలయం భక్తులతో కిటకిటలా డింది. ఆలయ ప్రాంగణం మల్లన్న నామ స్మరణతో మారుమ్రోగింది. తమ ఇష్టమైన మల్లికార్జున స్వామిని పూజించుకునేందుకు పిల్ల పాపలతో, కుటుంబ సమేతంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో కొలువు దీరిన వల్లు బండకు రెండు వైపుల చేతులు పెట్టి భక్తులు పూజలు నిర్వహించా రు. వల్లు బండ వద్ద భక్తుల తాకిడితో రద్దీగా మారిం ది. తీరు తీరు పత్రి తెచ్చి తీరొక్క పూజలు చేసారు. పలువురు భక్తులు తమ తమ మొక్కులను (బంగారం) బెల్లం ముద్దలతో తీర్చుకున్నారు. మరికొంత మంది భక్తులు కోడే దూడలను తిప్పుతూ వారి మొక్కులను చెల్లించుకున్నారు. మల్లన్న ఉత్సవ మూర్తి విగ్రహాన్ని పల్లకిలో వైభవంగా ఊరేగించారు. మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. జాతర సందర్భంగా ప్రత్యేక వైద్య శిబిరం ను ఏర్పాటు చేశారు.

# ఫస్ట్ ఇన్ మ్యాథ్స్ పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## విద్యార్థుల్లో గణిత భయం పోగొట్టి, ఆసక్తి పెంపొందించడమే ప్రధాన లక్ష్యం




**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని బాలక్ మందిర్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 'ఫస్ట్ ఇన్ మ్యాథ్స్' పేరుతో వినూత్న పైలెట్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణితం పట్ల విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించి, ఆసక్తిని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. గణితం ఒక క్లిష్టమైన విషయం కాదని, సరైన పద్ధతిలో నేర్పితే అది అత్యంత ఆసక్తికరమైన, ఉపయోగకరమైన శాస్త్రమని పేర్కొన్నారు. విద్యార్థులు లెక్కలను కేవలం పరీక్షల కోసం కాకుండా, జీవిత నైపుణ్యాలుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఫస్ట్ ఇన్ మ్యాథ్స్ కార్యక్రమం ద్వారా సంకలనం, వ్యవకలనం, గుణకారం, భాగహారం వంటి ప్రాథమిక గణిత అంశాలను డిజిటల్ విధానాలు, ఆటల రూపంలో బోధించనున్నట్లు ఆయన వివరించారు. ముఖ్యంగా 6వ, 7వ, 8వ తరగతి విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ఈ శిక్షణను రూపొందించామని తెలిపారు. నెలరోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న ఈ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, జిల్లాలోని మరిన్ని పాఠశాలలకు విస్తరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచి, లెక్కలపై పట్టు సాధించేందుకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏఎంఓ లక్ష్మణ్, అసిస్టెంట్ ఏఎంఓ అజయ్, కార్యక్రమ నిర్వాహకులు నిఖిల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దౌర్జన్యం, అక్రమ వసూళ్లు రౌడీషీటర్‌తో పాటు ఇద్దరు అరెస్ట్

## కుల దూషణ కేసు నమోదు.. రూ.30 వేలు డిజిటల్ ఆధారాలు స్వాధీనం

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లాలోని మావల పోలీస్ స్టేషన్ పరిధిలో దౌర్జన్యం, అక్రమ వసూళ్లు, కుల దూషణలకు పాల్పడిన రౌడీషీటర్‌తో పాటు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని అదనపు ఎస్పీ (ఆప్స్), ఇన్‌చార్జ్ ఎస్డీపీఓ సురేందర్ రావు వెల్లడించారు. అరెస్టైన వారిలో జాధవ్ గోపాల్ ఏ జవాడే గోపాల్ , కాంబ్లే శంకర్, మొహితే ఆకాష్ ఉన్నారు. ప్రధాన నిందితుడు జాధవ్ గోపాల్‌పై ఇప్పటికే మావల పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదు కాగా, అతనిపై ఉట్నూర్, ఆదిలాబాద్ ఐ-టౌన్, మావల పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం సహా మొత్తం ఎనిమిది కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. పిట్టలవాడకు చెందిన షెల్కే దత్తు ఫిర్యాదు మేరకు, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో నిందితులు రూ.30,000 వసూలు చేసి, డబ్బులు ఇవ్వకపోతే ప్రాణహాని కలిగిస్తామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే బాధితుడి భార్య ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకుంటామని కూడా హెచ్చరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిబ్రవరి 26న దస్నాపూర్‌లోని మధుర టీ హోటల్ వద్ద బాధితుడిని అడ్డగించి కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి మరిన్ని డబ్బులు డిమాండ్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం వెంటనే దర్యాప్తు చేపట్టి, ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. నేరానికి ఉపయోగించిన మూడు మొబైల్ ఫోన్లు మరియు ఫోన్‌పే ద్వారా జరిగిన రూ.30,000 లావాదేవీల డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, వారిని న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఎన్నికల సహాయం చేయడం జరిగింది లేదా ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఘటనలపై వెంటనే మావల పోలీస్ స్టేషన్ లేదా డీఎస్పీ కార్యాలయానికి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే ప్రవేశ పెట్టాలి

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** నిరంతరం న్యాయవాద వృత్తిలో నిరంతరం న్యాయం కోసం పాటుపడుతున్న న్యాయవాదుల రక్షణ కోసం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే ప్రవేశ పెట్టాలని ఉట్నూర్ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఉట్నూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జిలు ధరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై వివిధ రూపాల్లో జరుగుతున్న దాడులను హత్యలను తీవ్రంగా ఖండిస్తూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాపురెడ్డి జనరల్ సెక్రటరీ జైవంత్ రావు కోశాధికారి శ్రీనివాస్ న్యాయవాదులు జమీర్ ఖాన్ పెందూర్ ప్రభాకర్ చింతల గిరి కుడెల్లి అశోక్ చంద్రమౌళి నాతరి రాజు విశాల్ జాదవ్ మానాల లక్ష్మీనారాయణ దుర్వ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## సుంకిని గ్రామంలో 'మన ఇసుక వాహనం' సేవలు ప్రారంభం



**వాస్తవ నేస్తం,కోటగిరి(పోతంగల్) :** నిజాంబాద్ జిల్లా పోతంగల్ మండల పరిధిలోని సుంకిని గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మన ఇసుక వాహనం' సేవలను తహసీల్దార్ గంగాధర్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు ఇసుక కొరత లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఇసుకను అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వినియోగదారులు 'మన ఇసుక వాహనం' మొబైల్ యాప్ ద్వారా తమకు కావాల్సిన ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని, బుకింగ్ చేసిన 24 గంటల్లోపు ఇసుకను నేరుగా ఇంటి వద్దకే చేరవేస్తామని ఆయన వివరించారు. ఈ విధానం వల్ల ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటంతో పాటు, ప్రభుత్వ నిర్ణీత ధరలకే ఇసుక లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు, షిండే షాజీ పటేల్, తహసిల్దార్ గంగాధర్, జిపిఓ నవీన్, నాయకులు చంద్రకాంత్, మల్లుగొండ, శంకర్, శక్తి రామ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ




**వాస్తవ నేస్తం,కోటగిరి :** మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యంత్రీకరణ సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న రాయితీపై 08 కల్టివేటర్లు, మొక్కల సంరక్షణకు ఉపయోగపడే 17 పవర్ స్ప్రేయర్లు, మరియు ఒక బ్రష్ కట్టర్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ హనుమంతు, వైస్ చైర్మన్ అనిల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొట్టం మనోహర్, కోటగిరి సర్పంచ్ బర్ల మధుకార్ మట్లాడుతూ.. సాగులో కూలీల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం యంత్రీకరణకు పెద్దపీట వేస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి రాజు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో యాద్గార్పూర్ సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారులు సతీష్, షేక్ గౌస్, సందీప్, వివిధ కంపెనీల డీలర్లు మరియు లబ్ధిదారులైన రైతులు పాల్గొన్నారు. ఆధునిక యంత్రాల వినియోగం వల్ల సాగు వ్యయం తగ్గి, దిగుబడి పెరుగుతుందని అధికారులు ఈ సందర్భంగా రైతులకు వివరించారు.

## రైల్వే స్టేషన్, రిమ్స్ పరిసరాల్లో సెల్‌ఫోన్ దోపిడీలు ఐదుగురు అరెస్ట్, ఒక బాల నేరస్థుడు పట్టివేత



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:**

పట్టణంలోని రైల్వే స్టేషన్, రిమ్స్ ఆసుపత్రి, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ల దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించగా, వారితో పాటు ఉన్న ఒక బాల నేరస్థుడిని జువెనైల్ హోంకు పంపినట్లు టూ టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అరెస్టైన వారిలో సయ్యద్ నవీద్ అలీ ఏ బడా ముష్రఫ్, మీర్జా ముష్రఫ్ బిగ్ ఏ చోటా ముష్రఫ్, షేక్ బిలాల్ ఏ బిలాల్ అహ్మద్, షేక్ హర్షద్, బన్సోడె కిషన్ కన్నయ్య ఉన్నారు. మరో 15 ఏళ్ల బాలుడు కూడా ఈ కేసులో నిందితుడిగా గుర్తించారు. వీరంతా ఆదిలాబాద్ పట్టణానికి చెందినవారే. ఈ నెల 26న సగుడారపు కనిష్క్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయింది. ఫిర్యాదు ప్రకారం, ఈ నెల 15న రైల్వే స్టేషన్‌లో పని ముగించుకుని బయటకు వస్తుండగా నలుగురు వ్యక్తులు అతన్ని అడ్డగించి డబ్బులు లాక్కోవడానికి యత్నించారు. డబ్బులు లేవని చెప్పడంతో అతని మొబైల్ ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. ఈ మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం వేగంగా చర్యలు తీసుకుని ఆరుగురిని పట్టుకుంది. విచారణలో వీరు రైల్వే స్టేషన్, బస్టాండ్, రిమ్స్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ అవకాశం చూసి మొబైల్ ఫోన్లు లాక్కొని దోపిడీలకు పాల్పడుతున్నట్లు తేలింది. నిందితుల వద్ద నుంచి గతంలో దోపిడీ చేసిన ఏడు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పదేపదే నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి నేరస్థుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయవద్దని, సరైన పత్రాలు లేకుండా ఫోన్లు కొనుగోలు చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొబైల్ షాప్ యజమానులు యజమానుల అనుమతి, చెల్లుబాటు అయ్యే పత్రాలు పరిశీలించిన తర్వాతే ఫోన్లు కొనుగోలు చేయాలని సూచించారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com